## విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తొవ్వ దినపత్రిక లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

జిల్లా బ్యూరో చీఫ్‌లు — జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌లు

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు — మండల రిపోర్టర్‌లు

సంప్రదించవలసిన ఫోన్ నెంబరు :

8328649322, 9398236146.



TGTEL/25/A0977

# తొవ్వ

స్వాగతం

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 334 | శుక్రవారం 11-07-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 2 | వెల : 5 రూ/.


## కొండా మురళిపై చర్యలు తీసుకుంటారా.. లేదా?

**నియోజకవర్గాల్లో వారి జోక్యం ఎక్కువైంది**

**వారిలా మేం అన్ని పార్టీలూ మారలేదు**

**హైదరాబాద్/వరంగల్, జూలై 10:** ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఆ పార్టీ సీనియర్ నేత కొండా మురళి వ్యాఖ్యలపై టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ విచారణ కొనసాగుతూనే ఉంది. గురువారం గాంధీభవన్‌లో ఈ అంశంపైన కమిటీ చైర్మన్ మల్లు రవి అధ్యక్షతన జరిగిన భేటీలో ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకుల అభిప్రాయాలను రికార్డు చేశారు. సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డిలు వివాదానికి సంబంధించి తమ అభిప్రాయాలు చెప్పారు. అయితే సమస్యపైన అనవసరమైన హడావుడి చేస్తున్నారని, సమస్యను పెంచుతున్నారా లేక తగ్గిస్తున్నారా అని కడియం శ్రీహరి ప్రశ్నించినట్లు తెలిసింది.

## కేసీఆర్‌కు వైద్య పరీక్షలు!

**యశోద ఆస్పత్రిలో ఉదయం నుంచి సాయంత్రం దాకా ఉన్న బీఆర్ఎస్ అధినేత**



**హైదరాబాద్ సిటీ, జూలై 10 :** బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ మరోసారి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇటీవల అస్వస్థతకు గురైన కేసీఆర్ చికిత్స నిమిత్తం సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. డిశ్చార్జి అనంతరం ఆయన నందినగర్‌లోని తన నివాసానికి వెళ్లి విశ్రాంతి తీసుకుంటున్నారు. వైద్యుల సలహా మేరకు గురువారం కేసీఆర్ మరోసారి ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం 9.30 గంటలకు ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలన్నీ పూర్తయిన తర్వాత సాయంత్రం 6.30 గంటలకు కేసీఆర్ ఇంటికి వెళ్లిపోయారు.



# బీసీలకు 42% రిజర్వేషన్లు

- ఆర్డినెన్స్ మార్గంలో అమలుకు మంత్రివర్గ నిర్ణయం
- పంచాయతీరాజ్ చట్టం-2018కు సవరణలు
- మండలం, జిల్లా, రాష్ట్రం యూనిట్లుగా రిజర్వేషన్లు
- మరో 22,033 కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు
- ఎమిటీ, సెయింట్ మేరీలకు వర్సిటీల హోదా
- 3 అధునాతన గోశాలల ఏర్పాటుకు నిర్ణయం
- నాలుగు గంటలపాటు సాగిన క్యాబినెట్ భేటీ

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు

**హైదరాబాద్, జూలై 10:** రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రంలో అమలులో ఉన్న పంచాయతీరాజ్ చట్టం-2018ను సవరించి, ఆర్డినెన్స్‌ను తేవడం ద్వారా ఈ రిజర్వేషన్లను వర్తింపజేస్తారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి, తమ నాయకుడు రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రివర్గం ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. మధ్యాహ్నం 3.30 నుంచి నాలుగు గంటలపాటు సుదీర్ఘంగా సాగిన సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి క్యాబినెట్ సమావేశ వివరాలను విలేఖర్లకు వివరించారు. మార్చి నెలలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనే విద్య, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే రెండు బిల్లులను ఆమోదించారు. అయితే, వాటికి రాష్ట్రపతి ఆమోదం పొందడం ఆలస్యం కావడంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్లను నెల రోజుల్లో ఖరారు చేయాలంటూ ఇటీవల హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో గురువారం సమావేశమైన మంత్రివర్గం 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించింది. సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే బీసీ డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది. రాష్ట్ర ప్రణాళిక విభాగం అధ్వర్యంలో కుల గణనను చేపట్టింది. వీటి ఆధారంగానే అసెంబ్లీలో రిజర్వేషన్ల బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకున్నది. అందుబాటులో ఉన్న ఎంపిరికల్ డేటా ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఖరారు చేసింది. సర్పంచి, ఎంపీటీసీ పదవులకు సంబంధించి బీసీ రిజర్వేషన్ల ఖరారుకు మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలని, ఎంపీపీ, జడ్పీటీసీలకు జిల్లా యూనిట్‌గా తీసుకోవాలని, జడ్పీ చైర్మన్లకు రాష్ట్రం యూనిట్‌గా తీసుకోవాలని నిర్ణయించారు. ఇందుకోసం పంచాయతీరాజ్ చట్టం-2018ను సవరిస్తూ ఆర్డినెన్స్‌ను జారీ చేయాలని నిర్ణయించారు. విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులను అసెంబ్లీలో ఆమోదింపజేసుకుని, గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించామన్నారు. ముఖ్యమంత్రి, బీసీ సంక్షేమ మంత్రి, ఇతర మంత్రులు అనేక పర్యాయాలు ఢిల్లీకి వెళ్లి సంబంధిత మంత్రులు, అధికారులతో చర్చించారని తెలిపారు. అధికారులు కొర్రీలు వేస్తూ సాగదీస్తూ ఉండటంతో అడ్వొకేట్ జనరల్‌ను రాష్ట్ర మంత్రివర్గ సమావేశానికి పిలిపించి చర్చించామన్నారు. న్యాయపరంగా భవిష్యత్తులో చిక్కులు రాకుండా చూసేందుకు తగిన జాగ్రత్తలు తీసుకొని ఆర్డినెన్స్ మార్గంలో రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామని ప్రకటించారు. ఇందుకు గాను పంచాయతీరాజ్ చట్టం-2018ను సవరిస్తూ ఆర్డినెన్స్‌ను తెస్తామన్నారు.

## ప్రభాకర్‌రావు అరెస్టుకు అనుమతివ్వండి!

- ఆయన విచారణకు సహకరించడం లేదు
- సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనున్న సిట్



**హైదరాబాద్/సూర్యాపేట క్రైం, జూలై 10 :** ఫోన్ ట్యాపింగ్ కేసును విచారిస్తున్న సిట్ అధికారులు గురువారం ఢిల్లీ వెళ్లారు. ప్రభాకర్‌రావు విచారణకు సహకరించడం లేదని సుప్రీంకోర్టులో పిటిషన్ వేసేందుకు డీసీపీ విజయకుమార్, ఏసీపీ వెంకటగిరి ఢిల్లీ వెళ్లినట్లు తెలిసింది. ప్రభాకర్‌రావును వచ్చే నెల 5 వరకు అరెస్టు చేయొద్దని సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉపశమనాన్ని రద్దు చేయాలని కోరుతూ పిటిషన్ వేయనున్నట్లు సమాచారం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విచారణకు హాజరవుతున్న ప్రభాకర్‌రావు దర్యాప్తు అధికారులకు సహకరించడం లేదని, 40గంటలు విచారించినా ట్యాపింగ్ వెనక ఉన్నదెవరన్న విషయాలను ఆయన బయటపెట్టడం లేదని అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేయనున్నారు. అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, మోసపూరిత విధానాలను అనుసరించారని విచారణలో స్పష్టమైందని చెప్పనున్నారు. అయితే, ఫోన్ ట్యాపింగ్‌కు ప్రేరేపించింది ఎవరు? జర్నలిస్టులు, వ్యాపారులు, సినీ ప్రముఖులు, న్యాయమూర్తులు, రాజకీయ నాయకుల ఫోన్ల ట్యాపింగ్‌కు ఆదేశాలిచ్చిందెవరనే విషయాన్ని నిర్ధారించుకోవాలంటే ప్రభాకర్‌రావును కస్టడీలోకి తీసుకొని విచారించాల్సిన అవసరం ఉందని చెప్పనున్నారు.

## పరిగణనలోకి ఆధార్ కూడా..

### ఓటర్ గుర్తింపు కార్డు, రేషన్ కార్డు సైతం

- బిహార్‌లో ఈసీ చేపట్టిన ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు
- ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ - ప్రక్రియ రాజ్యాంగబద్ధమేనని ధర్మాసనం స్పష్టీకరణ
- నిలిపివేతకు నో.. తదుపరి విచారణ 28న- సుప్రీం తీర్పుతో ప్రజాస్వామ్యానికి ఊరట: కాంగ్రెస్






**న్యూఢిల్లీ, జూలై 10:** ఎన్నికల కమిషన్ బిహార్‌లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిలిపివేయాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. రాజ్యాంగంలోని 324 అధికరణ ప్రకారం, ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950 ప్రకారం చేపట్టిన ఈ ప్రక్రియ రాజ్యాంగబద్ధమైనదేనని స్పష్టం చేసింది. అయితే.. శాసనసభ ఎన్నికలకు ముందు ఈ ప్రక్రియను నిర్వహించడం ఏమిటని ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించింది. ఓటర్లు తమ గుర్తింపును ధ్రువీకరించుకోవడానికి అనుమతించే పత్రాల జాబితాలో.. ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డులను గుర్తింపు పత్రాలుగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఈ ప్రక్రియపై పలు పార్టీలు, ఎన్జీవోలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. అలా దాఖలైన పదికి పైగా పిటిషన్లను.. జస్టిస్ సుధాన్షు ధూలియా, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం విచారించచింది. ఎన్నికల కమిషన్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది.. ఆధార్‌ను పౌరసత్వ గుర్తింపు పత్రంగా అంగీకరించలేమని కోర్టుకు తెలిపారు. దీనికి కోర్టు.. పౌరసత్వాన్ని ధ్రువీకరించాల్సింది హోం శాఖ అని, అది ఈసీ పని కాదని గుర్తుచేసింది. గుర్తింపు ప్రక్రియకు ఈసీఐ అనుమతిస్తున్న 11 పత్రాల జాబితా సమగ్రమైనదేమీ కాదని.. కనుక, ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డులను కూడా పరిగణనలోకి తీసుకుంటే అందరికీ న్యాయం జరుగుతుందన్నది తమ అభిప్రాయమని పేర్కొంది. అయితే, దీనిపై తుది నిర్ణయం తీసుకునే అధికారం ఈసీదేనని.. ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు కారణాలు మాత్రం వెల్లడించాలని ఆదేశించింది. “మీరు ఈ ప్రక్రియను చేపట్టడం సమస్య కాదు. కానీ.. చేపట్టిన సమయమే సమస్య. నవంబరులో జరిగే శాసనసభ ఎన్నికలకు దీనికి ముడిపెట్టడమెందుకు? ఎన్నికలతో సంబంధం లేకుండా దీన్నెందుకు నిర్వహించలేరు? కొంచెం ముందే దీన్ని ఎందుకు నిర్వహించలేదు?” అని విచారణ సందర్భంగా కోర్టు ప్రశ్నించింది. ఓటర్ల జాబితా ఒక్కసారి ఖరారైతే కోర్టులు అందులో జోక్యం చేసుకోవని.. ఇదంతా ఎన్నికలకు ముందు జరగడం వల్ల.. నష్టపోయిన వ్యక్తులు సవరించిన జాబితాను కోర్టులో సవాల్ చేసే అవకాశాన్ని కోల్పోతారని పేర్కొంది. ఇక.. పిటిషనర్లలో ఒకరైన అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ వాదనలు వినిపించారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలో సమగ్ర సవరణ, సంక్షిప్త సవరణ గురించి మాత్రమే ఉందని.. ‘ప్రత్యేక సమగ్ర సవరణ’ గురించి అందులో ఎక్కడా లేదని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

## భారతదేశ పటంలో తెలంగాణకు చోటు లేదా?

**ఏపీ బీజేపీ అధ్యక్షుడు ఆ రాష్ట్ర మంత్రి లోకేశ్‌కు ఇచ్చిన దేశ పటంలో తెలంగాణ లేదేం?**

**ఇది బీజేపీ విధానమా?.. ప్రధాని స్పందించాలి: కేటీఆర్**



**హైదరాబాద్, జూలై 10:** భారతదేశ చిత్రపటంలో తెలంగాణకు చోటు లేదా? తెలంగాణను తొలగించడంలో మీ ఉద్దేశం ఏంటి? అని బీజేపీ నేతలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ ఆ రాష్ట్ర మంత్రి లోకేశ్‌కు ఇచ్చిన భారతదేశ పటంలో తెలంగాణ లేకపోవడంపై గురువారం ఎక్స్‌లో కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. లోకేశ్‌కు బహుమతిగా ఇచ్చిన చిత్రపటంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను మాత్రమే చూపించడం దారుణమన్నారు. ఇది పూర్తిగా అనుచితమని, ఇది బీజేపీ అధికారిక అభిప్రాయమా? అని కేటీఆర్ ప్రధాని మోదీని ప్రశ్నించారు. తెలంగాణను భౌగోళికంగా గుర్తించకపోవడంపై ప్రధాని సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ ప్రజల త్యాగాలు, రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటాలను అగౌరవపర్చడం తగదని పేర్కొన్నారు. పొరపాటైతే, తెలంగాణ ప్రజలను అపహాస్యం చేసినందుకు గాను బీజేపీ నాయకత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**కల్తీకల్లు మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు ఇవ్వాలి**

హైదరాబాద్‌లో కల్తీకల్లు తాగి ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలన్నారు.

## ఈ నెల 27న జీపీవో ఎంపిక పరీక్ష

గ్రామపాలనాధికారుల(జీపీవో) ఎంపికకు సంబంధించి ఈ నెల 27న మరోసారి పరీక్ష నిర్వహిస్తామని భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ తెలిపారు. మాజీ వీఆర్వో, వీఆర్ఏలకు గ్రామపాలనాధికారులుగా అవకాశం కల్పించేందుకు గతంలో ఒకసారి పరీక్ష నిర్వహించారు. ఆ సమయంలో కేవలం 3450 మంది మాత్రమే ఎంపికయ్యారు. దీంతో మరోసారి పరీక్ష నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ఆసక్తి ఉన్న మాజీ వీఆర్వో, వీఆర్ఏలు ఈ నెల 16వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సీసీఎల్ఏ డీఎస్ లోకేష్ కుమార్ సూచించారు.

## బీసీ రిజర్వేషన్లపై క్యాబినెట్ నిర్ణయం.. జాగృతి విజయమే

**జై తెలంగాణ అనని వ్యక్తి.. సీఎం అయ్యారు: ఎమ్మెల్సీ కవిత**

**5గ్రామాలను తెలంగాణకు ఇవ్వాలంటూ ఏపీ సీఎంకు లేఖ**



**కొత్తగూడెం/హైదరాబాద్, జూలై 10:** రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌తో తెలంగాణ జాగృతి చేపట్టిన ఉద్యమాలకు రేవంత్ సర్కార్ దిగొచ్చిందని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదం తెలపడం తెలంగాణ జాగృతి, యూపీఎఫ్, బీసీ సమాజం సాధించిన ఓ ప్రకటనలో వెల్లడించారు. కాగా, తెలంగాణ ఏర్పడిన తర్వాత కనీసం జై తెలంగాణ అనని వ్యక్తి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారని కవిత ధ్వజమెత్తారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ.. కాంగ్రెస్ పాలనలో ఆగమైపోతోందన్నారు. కొత్తగూడెంలో గురువారం తెలంగాణ జాగృతి జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కవిత మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి వాస్తు భయంతో సచివాలయానికి రావడం లేదన్నారు. సీఎం విసిరే సవాళ్లను తాము స్వీకరించగానే తోక ముడుస్తారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి సంస్థను పట్టించుకోవడం లేదని, ప్రైవేటీకరించాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కాగా, భద్రాచలం పట్టణాన్ని ఆనుకొని ఉన్న 5 పంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని కోరుతూ ఏపీ సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. 2014లో ఏకపక్షంగా విలీనం చేసుకోవడంతో యటపాక, కన్నాయిగూడెం, గుండాల, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఏపీలో ఉన్న భద్రాచలం ఆలయ భూములు కబ్జాకు గురవుతున్నాయని పేర్కొన్నారు.

# మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీ నాయక్ గురించి మాట్లాడే అర్హత మీకు లేదు

- కేసీఆర్ కట్టు బానిసలు మీరు
- మంత్రిగా మీరు ఈ జిల్లాకు చేసిందేమిటో చెప్పాలి.లి
- మానుకోట అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే మురళీ నాయక్ ఇంకోసారి నోరుజారితే ఖబర్దార్
- మీ మాటలు తెలంగాణ మహిళా లోకానికే సిగ్గుచేటు
- మీవన్నీ ఉత్తుత్తి జీవోలు
- మహబూబాబాద్ మున్సిపాలిటీ 50 కోట్ల రూపాయల జివో అమలెక్కడ కేటీఆర్
- కేటీఆర్ కోసం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఖాళీ కుర్చీతో చర్చకు ఆహ్వానం.
- కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శంతన్ రామరాజు.



**తోవ్వ,మహబూబాబాద్ ప్రతినిధి. జులై 08**

ఎమ్మెల్యే మురళీ నాయక్ గురించి మాట్లాడే అర్హత మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కు లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శంతన్ రామరాజు అన్నాడు. బుధవారం నాడు మాజీ గిరిజన సంక్షేమశాఖా మంత్రి సత్యవతి రాథోడ్ స్థానిక ఎమ్మెల్యే మీద, కాంగ్రెస్ పార్టీ మీద చేసిన విమర్శలను తిప్పికొట్టారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా శంతన్ రామరాజు మాట్లాడుతూ పదేళ్ల పాటు తెలంగాణలో విధ్వంసపు పాలన చేసిన మీరు ఎమ్మెల్యే మురళీ నాయక్ పై అవాకులు చెవాకులు పేలడం సిగ్గుచేటన్నారు. మంత్రిగా ఉన్న సమయంలో ఈజిల్లాకు మీరు చేసిందేమిటో చెప్పాలన్నాడు. కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని కాళ్లకు చెప్పులు లేకుండా తిరిగి బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని ఆయన కాళ్ళ దగ్గర పెట్టిన ఘనత నీకే దక్కిందని ఎద్దేవాచేశారు. మురళీ నాయక్ అంటే ఓ నిశ్శబ్ద విప్లవమన్నాడు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మానుకోటకు 400కోట్ల నిధులు తెచ్చిన ఘనత మా ఎమ్మెల్యేకు దక్కిందన్నాడు. కేటీఆర్, కేసీఆర్ మానుకోట పర్యటనలో మానుకోటకిచ్చిన 50, కోట్లు, వార్డుల మౌలిక సదుపాయాల కోసం 1కోటి 98లక్షల రూపాయల జీవోలు అన్నీ ఉత్తిట్టి జీవోలు అని ఆగ్రహం వెళ్లగక్కారు. ఆ జీవో కాపీలను చూపిస్తూ అవి నిజమైన జీవోలు అయితే అధికారంలో ఉండి గడ్డి పీకారా అని ప్రశ్నించారు. మీరుచేసిన పాపాలు శాపాలై మీకు ఓటమిని తెచ్చాయని అన్నాడు. ఆకడుపు మంటతో అహంకారంతో స్థాయిని మరచి విమర్శలు చేయడం తగదన్నాడు. కేసీఆర్ కుటుంబానికి కట్టప్పలా, కట్టు బానిసలా ఊడిగం చేసిన మీకు కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతికత లేదన్నాడు. ఆరు గ్యారంటీలతో ప్రజా సంక్షేమ పథకాల అమలుతో తెలంగాణ భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్నామన్నాడు. ఇకనైనా మీరుకాని, మీ కేటీఆర్ కానీ, మానుకోట బిఆరెస్ నాయకత్వం కానీ ఇంకోసారి కారు కూతలు కూస్తే సహించేది లేదని హెచ్చరించారు. స్థాయిని మరిచి మీ కేటీఆర్ చేస్తున్న సవాలుకు మేము సరిపోతామని దమ్ముంటే మానుకోటకు ఇచ్చిన ఉత్తుత్తి జీవోలపై చర్చకు రావాలని ఓ కుర్చీని కూడా ఖాళీగా ఉంచామని అన్నాడు.వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మీపార్టీ తరపున నిలబడటానికి కూడా అభ్యర్థులు దొరకరన్నాడు. ఊరుకు ఒకరిద్దరు బాగుపడితే అది బిఆరెస్ పాలన, ఊరంతా బాగుపడితే అది కాంగ్రెస్ పాలన ఇందిరమ్మ రాజ్యమన్నాడు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యమనోరమ, కమ్మగాని కృష్ణమూర్తి, నారాయణ్ సింగ్, సిరిపురం వీరన్న, గుగులోత్ రాములు నాయక్, భానోత్ హరిసింగ్ నాయక్, లకావత్ పద్మ, గంద్రాతి మల్లేష్, భూక్య లక్ష్మి, మాధవి, రాము తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి -సైదులు**

**ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి -నేషనల్ కమిటీ మెంబర్ - బి. దేవేందర్**

**రంగారెడ్డి గండిపేట్ తొవ్వ ప్రతినిధి:**

జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టి డబ్ల్యూ జె ఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం . సైదులు అన్నారు. గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ( టి డబ్ల్యు జే ఎఫ్ ) రాజేంద్రనగర్ నియోజకవర్గ స్థాయి సమావేశం గండిపేట మండల పరిధిలోని ఖానాపూర్ లో నియోజకవర్గ అధ్యక్షులు ఏ. గోపాల్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో నేషనల్ కమిటీ సభ్యులు బి. దేవేందర్ పాల్గొన్నారు. యూనియన్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఇ.బుచ్చన్న కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితి రోజురోజుకు దిగజారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదని తెలిపారు. గత ఎన్నికల్లో జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ఆ పార్టీ ఇప్పటివరకు ఏ ఒక్క హామీ నెరవేరలేదన్నారు.. సమాజంలో ఫోర్త్ ఎస్టేట్ గా పిలువబడుతున్న మీడియా రంగాన్ని పట్టించుకోకపోవడం వల్ల అందులో పని చేస్తున్న జర్నలిస్టుల జీవితాలు ఆగమవుతున్నాయని తెలిపారు. వార్తలు రాసే క్రమంలో జర్నలిస్టులపై అనేకమైన దాడులు జరుగుతున్నాయని వాటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఇండ్ల స్థలాలు, కొత్త అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. ఉద్యోగ భద్రత, గౌరవ వేతనం, పెన్షన్ హెల్త్ కార్డులు, పిల్లలకు ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో యూనియన్లకతీతంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. నేషనల్ కమిటీ మెంబర్ దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు పెంచాలని సూచించారు. తమ హక్కుల సాధన కోసం ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. అధ్యక్ష కార్యదర్శులు ఏ. గోపాల్ ఇ. బుచ్చన్న మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గం జర్నలిస్టుల సమస్యల కోసం ప్రతిపాదించిన పలు తీర్మానాలను కచ్చితంగా అమలు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కే. సుదర్శన్ గౌడ్, ఎం. శ్రీనివాస్, సలహాదారు కే. యాదయ్య, ఉపాధ్యక్షులు ,ఇ. ప్రభాకర్ , పీ.మాధవాచారి, సహాయ కార్యదర్శులు పి. యాదగిరి, ఎం. శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి ఆర్. జ్ఞానేశ్వర్, ఎం . విజయ్, ఎం. కిట్టు ప్రసాద్, సుధీర్ కుమార్, అనిల్ కుమార్, జీ. శ్రీనివాస్ జీ తదితరులు పాల్గొన్నారు. ఫోటోజిసమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

## ఆగ్రోస్ సేవా కేంద్రాలకు" యూరియా"

# సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలి

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలకు వినతి పత్రం అందజేసిన**

**ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, మండల నేతలు**



**తొవ్వ, నెల్లికుదురు, జూలై 10**

వర్షాకాల సీజన్ ప్రారంభమై నెల కావస్తున్న మండలంలో తగినంత యూరియా సరఫరా కాకపోవడంతో రైతన్నలు వరి నాట్లకు నానా ఇబ్బందులు పడుతున్నందున తక్షణమే వ్యవసాయ శాఖ అనుబంధ ఆగ్రోస్ సేవా కేంద్రాలకు తగినంత యూరియా సరఫరా చేసి రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసం లక్ష్మారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జెల్లా వెంకటేష్, అగ్రస్ సేవా కేంద్రాల మండల కన్వీనర్ పెరుమాండ్ల శంకర్ గౌడ్ లతో కలిసి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు గురువారంహైదరాబాదులోని రాష్ట్ర సచివాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో యూరియాను కేవలం పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాల ద్వారానే విక్రయాలు జరుపుతున్నారని, వాటి మాదిరిగానే ప్రజలకు మరింత చేరువలో విత్తనాలు ఎరువులు అందించాలనే లక్ష్యంతో ఆగ్రో సేవా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. లక్ష్యాన్ని నెరవేర్చడం కోసం ఆయా కేంద్రాల ద్వారా యూరియా సరఫరా చేస్తే రైతులు ఇబ్బందులు పడకుండా ఆదుకున్నట్లు అవుతుందని మంత్రికి వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తక్షణమే ఆగ్రోస్ సేవా కేంద్రాలకు యూరియా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. రైతులు అధైర్య పడవద్దని ప్రభుత్వం సకాలంలో ఎరువులు విత్తనాలు అందించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## మున్నేరు ప్రాజెక్టు నిర్మాణం సాధించేందుకు ఉద్యమిద్దాం

**మున్నేరు ప్రాజెక్టు జల సాధన కమిటీ**



**తొవ్వ, గార్ల జూలై 10**

గార్ల మండల పరిధిలోని ముల్కనూరు గ్రామ సమీపంలో మున్నేరు ప్రాజెక్టు నిర్మాణాన్ని సాధించేవరకు ఉద్యమాన్ని ఆపమని మున్నేరు ప్రాజెక్టు జల సాధన కమిటీ కన్వీనర్ గౌని ఐలయ్య స్పష్టం చేశారు.స్థానిక మంగపతిరావు భవనం (సిపిఎం)లో కందునూరి శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన మున్నేరు ప్రాజెక్టు జల సాధన కమిటీ అధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు ముఖ్యులు మాట్లాడారు.ఈ సమావేశంలో అఖిలపక్షం నాయకులు కట్టెబోయిన శ్రీనివాస్, జడ సత్యనారాయణ, అలవాల సత్యవతి,గంగావత్ లక్ష్మణ్ నాయక్,శీలం శెట్టి రమష్, జి.సక్రు,ఎన్.వెంకటేశ్వర్లు,.వెంకన్న,బి.లోకేశ్వరావుక.ఉమామహేశ్వరావు,ఐ.గ ోవింద్,సత్యంగౌడ్,షర్పుద్దిన్,టి.వి.వి.రాష్ట్ర అధ్యక్షులు జె.విశ్వ,రైతులు జాస్తి సత్యనారాయణ, వై.లక్ష్మయ్య, యం.బిక్షం తదితరులు ఉన్నారు

# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**ఘనంగా సత్య సాయి పూజలు**

**సాయి సేవలో తరించిన కురవి పుర ప్రముఖులు,**

**సత్య సాయి సేవ సమితి ట్రస్ట్ చైర్మన్ చిత్తనూరి శ్రీనివాస్,**



**తొవ్వ న్యూస్ ప్రతినిధి, కురవి జూలై 10,**

గురు పౌర్ణమి సందర్భంగా ప్రశాంతి నిలయం లో సత్య సాయి సేవ సమితి సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ట్రస్ట్ చైర్మన్ చిత్తనూరి శ్రీనివాస్ తెలిపారు. ఇల్లు నే ప్రశాంతి నిలయంగా మార్చి శ్రీ సత్య సాయి బాబా పూజలు నిరంతరం చేస్తూ పుట్టపర్తి సత్యసాయి సేవా సమితి నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఈ ప్రాంత ప్రజలకు తెలియజేస్తూ అక్కడ జరిగినట్టే ఇక్కడ ప్రశాంతి నిలయంలో నిర్వహిస్తున్నట్లు గండేపల్లి తిరుమలరావు తెలిపారు. సత్య సాయి సేవ సమితికి సాయ సహాయ సహకారాలు అందిస్తున్న అర్చకులు బుక్క వీరన్న ఘనంగా సన్మానించారు. తన ఇల్లుని ఆలయంగా మార్చిన గండేపల్లి తెలుగు తిరుమలరావు దంపతులను, రమ శ్రీనివాస్ దంపతులు ఘనంగా సన్మానించారు. స్వామివారి సేవకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పద్మశాలి జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు గా అనుమాల సిద్దార్థ,

**తొవ్వ , మహబూబాబాద్ ప్రతినిధి,జులై 10:**



పద్మశాలి జిల్లా యువజన సంఘ్ జిల్లా అధ్యక్షుడు గా అనుమాల సిద్దార్థ, ను ఎన్నుకున్నట్టు సంఘం నాయకులు గద్దె రవి, చిలుకమారి వెంకటేశ్వర్లు, బొమ్మ వెంకటేశ్వర్లు, అనుమాల వెంకటేశ్వర్లు, చలమల్ల నారాయణ,తెలియజేశారు . గురువారం వారు మాట్లాడుతూ పద్మశాలి జిల్లా యువజ చైతన్యం కోసం నూతన కమిటీ ఎన్నుకున్నట్టు తెలిపారు . కార్యదర్శి గా గడీల వినోద్, కోశాధికారిగా మెతుకుభాస్కర్ ఉపాధ్యక్షునిగా బత్తుల కృష్ణ ఎన్నుకున్నాట్టు తెలిపారు .ఈ కార్యక్రమంలో కూరపాటి ఆదినారాయణ, కూరపాటి శ్రీను, కల్వకుంట్ల శ్రీను, మామిడాల శ్రీను, నక్క ఉపేందర్, గోషికొండ శేఖర్, కైరంకొండ వీరన్న, మేక నరేందర్, రాపాక కృష్ణ కండగట్ల విజయ కుమార్ పాల్గొన్నారు

## విద్యార్థులకు పాఠ్యాంశాలపై పఠనాసక్తి పెంపొందింప చేయాలి

**జిల్లా ఏ ఎం ఓ చంద్రశేఖర్ ఆజాద్**




**తొవ్వ, నెల్లికుదురు, జూలై 10**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పాఠ్యాంశాలపై పఠన ఆసక్తి పెంపొందింపజేయాలని జిల్లా ఏ ఎం ఓ చంద్రశేఖర్ ఆజాద్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని వావిలాల ఎంపియుపిఎస్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి పాఠశాలలో విద్యార్థుల అభ్యసన ప్రగతి,ఉపాధ్యాయుల తరగతి బోధన, ప్రారంభ పరీక్ష, విద్యార్థుల హాజరు, (ఎఫ్ ఆర్ ఎస్), పేటీఎం, ఎఫ్ ఎల్ ఎన్,, ఎల్ ఐ పి కి సంబంధించిన రికార్డులుఅన్నియు పరిశీలించి అనంతరం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి తగు సూచనలు చేస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు అడప కరుణాకర్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, ఖనీజ్ కస్పుల్ వీర, సంతోష్, ప్రవీణ్ కుమార్, తదితరులు ఉన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రవి రాథోడ్**

**తోవ్వ, నెల్లికుదురు, జూలై 10**



వర్షాకాలం ప్రారంభం అయినందున సీజనల్ వ్యాధుల పట్ల గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రవి రాథోడ్ ఉద్యోగులు సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ క్యాంపు నిర్వహణ తీరు, ఫార్మసీ , ల్యాబ్, గదులతో పాటు రోగులకు పరీక్షలు చేస్తున్న తీరును ఆయన పరిశీలించారు. అదేవిధంగా మందుల స్టాక్ వివరాలు, హాజరు పట్టికలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గృహాలలోని పరిసరాల్లో ఉన్న మురుగు కాలువలు శుభ్రం చేయడం, పరిసరాల పరిశుభ్రత పాటించే విధంగా ప్రజల్లో అవగాహన పెంపొందింప చేయాలన్నారు. అదేవిధంగా క్షయ వ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను బాధిత రోగులకు వివరించాలన్నారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శారద, సిహెచ్ఓ శాంతమ్మ, సూపర్వైజర్ షాహిన్ సుల్తానా, ఫార్మసిస్ట్ సోమ్లా నాయక్, రవీందర్, స్టాఫ్ నర్స్ పద్మవతి, సిబ్బంది మక్బూల్ తదితరులున్నారు.

# రైతుల భూములను పరిశ్రమల పేరుతో లాక్కోవడం దారుణం

## ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి జులై 10 :**
సంగారెడ్డి నియోజకవర్గంలో నెలకొన్న ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పీ. ప్రావీణ్యను గురువారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కలిశారు. బిఆర్ఎస్ శ్రేణులతో కలసి కలెక్టర్ కు సమస్యలపై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తన లెటర్ ప్యాడ్ తో ఉన్న వినతి పత్రం అందజేశారు . కొండాపూర్ మండలం మందాపూర్ , మునిదేవునిపల్లి గ్రామాలలో పరిశ్రమల పేరుతో రైతులు సాగు చేస్తున్న భూములను ప్రభుత్వం గుంజుకోవాలని చూస్తుందని ...రైతుల నుంచి భూములను లాక్కుంటే రైతులు రోడ్డున పడుతారాని అన్నదాతల బతుకులు చిన్నాభిన్నం చేసేలా ప్రభుత్వం ప్రతిపాదనలు ఉంచడం సరి కాదన్నారు. మునిదేవుని పల్లి గ్రామంలోని 92, 112, 154 సర్వే నెంబర్ లలో 293 ఎకరాల భూమి, మందాపూర్ గ్రామంలోని సర్వే నెంబర్ 22లో 321 ఎకరాల భూమి మొత్తం 614 ఎకరాలు దళితులు ,బీసీల భూములను పరిశ్రమల పేరుతో లాక్కోవడం సరికాదు . అలియాబాద్ , తోగర్ పల్లి గ్రామాలలో శివారులో 43 ఎకరాలు ... రైతులకు సమాచారం ఇవ్వకుండా ముందస్తు పొజిషన్ తీసుకున్నారు. అక్కడి భూమి విలువ రూ.రెండున్నర కోట్లు చొప్పున ఉంది... రైతులకు పరిహారం నిర్ధారణ చేయలేదు.సాగుకు అనుకూలంగా లేని భూమిని చూసుకొని కేటాయించుకోవాలి సూచించారు. రైతులు ప్రస్తుతం ఎక్కడి భూమిలో వర్షాధారణ పంటలు వేస్తుండగా, మరి కొందరు బోర్లు వేసుకొని కూరగాయలు, పండ్లు తోటలు సాగు చేస్తున్నారని గుర్తు చేశారు. ఏ పరిశ్రమ కోసం ప్రభుత్వం భూములు తీసుకుంటుంది... ఎలాంటి సమాచారం లేకుండా రైతుల సాగు భూమిని ప్రభుత్వం గుంజుకుంది...భూమి తీసుకున్న వారికి 6 వందల గజాలు స్థలం ఇవ్వాలి ఆది ఎక్కడ ప్రస్తావన లేదు. దళితుల , బీసీల భూములను బలవంతంగా లాక్కోవాలని చూస్తున్నారు... పరిశ్రమ పేరుతో లాక్కుంటే రైతులు రోడ్డున పడుతారు. అమాయక రైతులను మోసం చేస్తూ రైతుల పొట్ట కొడుతూ రైతుల భూములపై పరిశ్రమల పేరుతో ప్రభుత్వం తీసుకోవాలని చేస్తున్నది. నియోజకవర్గంలోని పెండింగ్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను ఎమ్మెల్యే కోరారు. సంగారెడ్డి ,సదాశివపేట పట్టణాలలో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ పనులు పూర్తి స్థాయిలో త్వరగా పూర్తి చేయాలని కోరారు. సదాశివపేట ,సంగారెడ్డిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సదాశివపేట ఎంపీపీ బిల్డింగ్ మిగిలిన పనుల కోసం 85 లక్షలు మంజూరు చేయాలని కోరారు.బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యత పాటించాలని, బైపాస్ రోడ్డు వెడల్పు కోసం చేసిన సర్వే విధంగానే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. సిద్ధాపూర్ రోడ్డు పనులు పూర్తి కాకముందే సంబంధిత కాంట్రాక్టర్ వెళ్లి పోయాడు రోడ్డు పనులు పూర్తి చేసే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్,పాల్గొన్నారు.

# యమలోకానికి పిలిచిన ఫోన్ కాల్

**-అర్ధరాత్రి ఫోన్ మాట్లాడుతూ అదుపుతప్పి..**
**-బిల్డింగ్ పైనుంచి పడి వ్యక్తి మృతి**



**మేడ్చల్ మల్కాజ్గిరి జులై 10**
బిల్డింగ్ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మహారాష్ట్రకు చెందిన దయానంద్ (32) బోడుప్పల్, వీరా రెడ్డి నగర్ లో బిల్డింగ్ సెంట్రింగ్ పనులు చేస్తూ బ్రహ్మాన్ గౌండ్ (20)తో కలిసి నివసిస్తున్నాడు. బుధవారం రాత్రి అతడు ఫోన్ మాట్లాడుతూ అదుపుతప్పి బిల్డింగ్ పైనుంచి కింద పడిపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఒక్క ఫోన్ కాల్ వల్ల వ్యక్తి ప్రాణాలే గాల్లో కలిసిపోయాయి, ఫోన్ మాట్లాడేటప్పుడు మన చుట్టూ పక్కల ఎం ఉన్నాయి అని చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుంది అని స్థానికులనుండి వస్తున్న సూచన.

# వేములపల్లి లో ఓటర్ నమోదుపై శిక్షణ

**అర్హులైన వ్యక్తులను ఓటరుగా నమోదు చేయాలి.**
**18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలి**
**జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ**



**వేములపల్లి, జూలై, 10**
వేములపల్లి మరియు మాడుగులపల్లి మండల పరిధిలోని ఓటర్ల నమోదు మార్పులు, చేర్పులు, బి ఎల్ ఓ యాప్, వీ హెచ్ ఓ యాప్ తదితర విషయాలపై ఈరోజు బూత్ లెవెల్ ఆఫీసర్స్, బూత్ లెవెల్ సూపర్వైజర్స్ కు జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమం జడ్ పి హెచ్ స్కూల్ వేములపల్లి లో నిర్వహించడం జరిగింది.ఈకార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మరియు (డిస్ట్రిక్ట్ ఎలక్షన్ ఆఫీసర్) ఇలా త్రిపాఠి మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని అధికరణ 324, 325, 326 ప్రకారము మరియు ఎన్నికల సంఘ నియమావళిని అనుసరించి 01/07/2025 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని. అర్హత కలిగిన ఏ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయకుండా ఉండడం అనేది రాజ్యాంగ విరుద్ధమని అందుకే జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి బి ఎల్ ఓ లకు మాస్టర్ ట్రైనర్లచే శిక్షణ ఇప్పించడం జరుగుతుందని, ప్రతి బి ఎల్ ఓ మీ ప్రాంతంలో ఉన్న అన్ని విషయాలపై సమగ్రమైనటువంటి అవగాహన కలిగి ఉండి ఫామ్ 6,7,8 లకు సంబంధించిన ఓటర్ల నమోదు పై అవగాహన ఏర్పరచుకొని క్షేత్రస్థాయిలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా తప్పులు లేని, పరిపూర్ణమైన ఓటర్ల జాబితాను నమోదు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హేమలత, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ ప్రవీణ్,జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్ గుడిపాటి కోటయ్య,అంబటి శ్రీను, తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది కోటేశ్వరి,సూపర్వైజర్లు, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ చేపల రైతుల దినోత్సవం



**నాగర్ కర్నూల్ జూలై 10**
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయ సముదాయంలో మత్స్యశాఖ కార్యాలయంలో జిల్లా అధికారిని ఏడి రజిని ఆధ్వర్యంలో జాతీయ చేపల రైతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు . సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేపలను రైతులు ఏవిధంగా చేప పిల్లల సీడ్, ఉత్పత్తి, సైజ్ పలు విషయాలపై సలహాలు సూచనలు ఇచ్చారు. రైతులు చేపల గురించి అవలంబించాల్సిన విధానాలు, పద్ధతులు పెంపకం పై మాట్లాడారు.అలాగే చేపల రైతులు ఆక్వా కల్చర్ నిపుణులు మరియు వాటాదారుల సహకారాన్ని అభినందిస్తూ స్థిరమైన ఆక్వా కల్చర్ పట్ల వారి నిబద్ధతను నొక్కి చెప్పడానికి భారతదేశం అంతట ప్రతి సంవత్సరం జూలై 10 న జాతీయ చేపల దినోత్సవం (ఎన్ ఎఫ్ ఎఫ్ డి) జరుపుకుంటారు అని తెలిపారు. చేపల నుండి పోటీన్ కోసం పెరుగుతున్న డిమాండ్ తీర్చడంలో ఉపాధి అవకాశాలను సృష్టించడంలో మరియు దేశ ఆహార భద్రతకు దోహదపడటంలో చేపల రైతులు పోషించే కీలకపాత్రను గుర్తించడానికి ఎన్ ఎఫ్ ఎఫ్ డి ఒక వేదిక గా పనిచేస్తుంది అని తెలిపారు. మత్స్య రంగంలో రైతుల కృషి చేపల పెంపకం మస సంపదను పెంచడంలో రైతులు చేసిన కృషిని గుర్తుచేశారు. ఈ జాతీయ చేపల రైతుల దినోత్సవాన్ని ఒక లక్ష్యంతో జరుపుకుంటారని తెలిపారు.

# మల్లేపల్లి లో మెగా ఆయిల్ ఫాం ప్లాంటేషన్ డ్రైవ్

**ఆయిల్ ఫామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది**
**దేవరకొండ లో ప్రతి సెంటు భూమికి సాగు నీరు అందిస్తా**
**దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**






**దేవరకొండ, జూలై 10**
నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలో దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమునా మాధవ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయిల్ ఫామ్ మొక్కలను అధికారులు మరియు ప్రజా ప్రతినిధులతో కలిసి నాటిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సాహిస్తుందని, రైతులకు తక్కువ పెట్టబడితో అధిక లాభాలు పొందవచ్చని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తెలిపారు.మారుతున్న పరిస్థితులకనుగుణంగా రైతులు వాణిజ్య పంటలను సాగు చేసుకోవాలన్నారు.దేవరకొండ ప్రతి సెంటు భూమికి సాగు నీరు అందిస్తా అని హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కో ఆప్షన్ సభ్యులు,ఎన్ ఎస్ యు ఐ నాయకులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా విహెచ్‌పి బృందం వివిధ క్షేత్రాలలో పర్యటన



**మహేశ్వరం,జులై 10 :**
శంషాబాద్ లోసమతా మూర్తి, శ్రీ రామానుజ దివ్య క్షేత్రంలో అహోభిలం స్వామిజీ నీ దత్తత్రేయ ఆశ్రమం లో శ్రీ. శరణందా స్వామిజి ప్రత్యేకంగా దర్శనం చేసుకొని ఆశీస్సులు తీసుకున్నారు.భారతీయ జ్ఞానం, సనాతన ధర్మం,సంస్కృతికి మూలకర్త, ఆయన రాయని, చూడని,వేదాల సృష్టికర్త, పురాణాల సృష్టికర్త, చరిత్ర సంరక్షకుడు, శ్రీ వేద వ్యాసుని జన్మదినోత్సవం విశేషమైనది.ఈ సందర్భంగా ప్రతి హిందువు సంగటితాం అవ్వాల్సిన సమయం ఆసన్న మైనది, హిందువులు నిద్ర మత్తు వదిలి వాస్తవాలు తెలిదుకోవాలని, అందరూ ఒక్కటే అనే భావన వదిలి వెయ్యాలని, భవిష్తత్తులో మన హిందూజాతి సంరక్షణ కోసం పాటుపడాలని వి. హెచ్. పి. మహేశ్వరం జిల్లా బృందం అన్నారు.

# బీబీ పేటలో గురుపౌర్ణమి ఉత్సవం



**కామారెడ్డి,జులై 10 :**
కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా గురుపౌర్ణమి ఉత్సవాలను జరుపుకున్నారు. బీబీపేట మండల కేంద్రంలోని టీఎస్ ఎన్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో బండి రాములు గురూజీ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమం ఘనంగా జరిపారు. గురుపూజోత్సవ విశిష్టతను ఈ సందర్భంగా గురు బండి రాములు తెలియజేశారు. కార్యక్రమంలో బిబిపేట యోగ సమితి అధ్యక్షుడు చందుపట్ల శ్రీహరి, మాజీ సర్పంచ్ గాడి లింగం, యోగ మాస్టర్ పంపర శివరాజు అనంత కుమార్ పరశురామ గౌడ్ నరసింహులు బాబు రాజయ్య అనురాధ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఎఫ్‌టిపిసి తెలంగాణ మీడియా డైరెక్టర్‌గా**
# మున్నూరు చందు నియమకం

**సికింద్రాబాద్, జూలై 10 :**



ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టిపిసి) తెలంగాణ రాష్ట్ర మీడియా డైరెక్టర్‌గా మున్నూరు చందును నియమించను న్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ నియామక కార్యక్రమం శనివారం ఉదయం 11 గంటలకు బషీరాబాద్ ప్రెస్ క్లబ్‌లో జరగనుంది.ఈ సందర్భంగా ఎఫ్‌టిపిసి జాతీయ అధ్యక్షులు చైతన్య జంగా, ప్రధాన కార్యదర్శి వర్మ, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ కిరణ్ సమక్షంలో మున్నూరు చందుకు నియామక పత్రం అందజేయనున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఫౌండర్, చైర్మన్ నోముల ప్రకాష్ హాజరవుతారు. అంతేకాకుండా, ఇండియన్ యాక్టర్స్, ప్లే బ్యాక్ సింగర్స్, బిగ్ బాస్ ఫ్రేమ్ బుల్లితెర నటులు ఈ వేడుకలో పాల్గొననున్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# తప్పిన పెను ప్రమాదం..

**కిష్టారెడ్డిపేట్ వద్ద స్కూల్ బస్ లో మంటలు**
**ప్రాణాలతో బయట పడ్డా ఐదు మంది విద్యార్థులు**

**సంగారెడ్డి,జులై 10 :**



సంగారెడ్డి జిల్లా కిష్టారెడ్డిపేట సమీపంలో పెను ప్రమాదం తప్పింది. పాఠశాలకు వెళ్తోన్న ఓ ప్రైవేటు బస్సు మంటలకు ఆహుతైంది. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తూ ఎవరూ గాయపడలేదు. ప్రమాద సమయంలో స్కూల్ బస్సులో ఐదుగురు విద్యార్థులు ఉండగా.. బస్సులో పొగరావడం చూసి వెంటనే కిందకు దిగారు. ఫైరింజన్ వచ్చేలోపే బస్సు పూర్తిగా కాలిపోయింది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో అన్ని వసతులు ప్రభుత్వం కల్పిస్తుంది

**బి ప్రధానమంత్రి కార్యాలయ అధికారిని మన్మిత్ కౌర్**
**బిప్రధానమంత్రి కార్యాలయ అధికారినితో కలిసి కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పరిశీలించిన కలెక్టర్**
**బి లబ్ధిదారులతో అధికారుల ముఖాముఖి**



**సంగారెడ్డి,జులై 10 :**
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, డబుల్ బెడ్ రూమ్ పథకాలలో పక్క ఇల్లు నిర్మించి ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. గురువారం ప్రధానమంత్రి కార్యాలయ అధికారిని మన్మిత్ కౌర్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వి కర్ణన్ లతో కలిసి కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులతో జరిగిన ముఖాముఖి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన రెండు పడక గదుల ఇండ్లను ప్రధానమంత్రి కార్యాలయ అధికారిని మన్మిత్ కౌర్ కలెక్టర్ ప్రావిణ్య, జిహెచ్ఎంసి కమిషనర్లు పరిశీలించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో గల వసతులను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు మెరుగైన వసతుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమీపంలో బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు, బ్యాంక్ సౌకర్యాలు, పోస్ట్ ఆఫీస్ ప్రైమరీ ఇంటర్ సెంటర్ అంగన్వాడి కేంద్రం,ప్రభుత్వ పాఠశాలు, ఇతర సౌకర్యాలు,వసతులను ప్రభుత్వం కల్పిస్తుంద న్నారు. దీంతోపాటు మెరుగైన రవాణా వసతుల కల్పన కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2 బీహెచ్ కె కాలనీ నుండి హైదరాబాదులోని అన్ని ప్రాంతాలకు బస్సు రవాణా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. లబ్ధిదారులు తమ వాటాగా పరిసరాల పరిశుభ్రత కోసం కృషి చేయాలని సూచించారు. తమ ఇండ్ల ఆవరణలో పచ్చని చెట్లు మొక్కలు నాటడం వల్ల ఆహ్లాదకర వాతావరణం ఏర్పడు తుందని ఆ దిశగా లబ్ధిదారులకు కృషి చేయాలని అన్నారు. అనంతరం అమీన్ పూర్ మున్సిపల్ కార్యాలయం సమీపంలో మహిళా సాధికారతలో భాగంగా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను అధికారులు పరిశీలించారు స్వశక్తితో క్యాంటీన్ నడిపిస్తున్న మహిళలను అభినందించారు. మహిళాసాధికారత,మహిళలఆర్థిక స్వావలంబనకోసం రాష్ట్ర ప్రభుత్వం మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా వివిధ వ్యాపారాలలో రాణించడానికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ ఏం .చైతన్య కుమార్ , జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి, పాల్గొన్నారు.

# నూతన మెడికల్ కాలేజీ నూతన ప్రభుత్వ హాస్పిటల్ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



**నాగర్ కర్నూల్ జూలై 10**
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం లోని ఉయ్యాలవాడలో నూతనంగా నిర్మించబడిన మెడికల్ కాలేజీని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీతో పాటు 550 పడకల ప్రభుత్వ హాస్పిటల్‌ని శంకుస్థాపన కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించనున్నారని అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే భవన నిర్మాణం, తరగతి గదులు, హాస్టల్ గదులు, ఇతర వసతులను సందర్శించారు. అధికారులతో చర్చలు జరిపి విద్యార్థులకు అందించవలసిన సౌకర్యాలపై దృష్టిసారించారు. అనంతరం నాగర్ కర్నూల్ మండలం తూడుకుర్తి గ్రామంలో 2 కోట్ల రూపాయలతో నూతనంగా మంజూరు అయిన పి హెచ్ సి నిర్మాణా శంకుస్థాపన స్థలాన్ని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి పరిశీలించారు.

**ప్రభుత్వ సాధారణ ఆస్పత్రి మెడికల్ సూపర్డెంట్‌గా**
# విధులలో చేరిన డాక్టర్ టి. ఉషారాణి



**నాగర్ కర్నూల్ జూలై 10**
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆస్పత్రి మెడికల్ సూపర్డెంట్ గా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించి ఆసుపత్రులకు మెడికల్ సూపరింటెండెంట్ లుగా ఆదేశాలు జారీ చేశారు.నిలోఫర్ ఆసుపత్రి హైదరాబాద్ నుండి పదోన్నతిపై వచ్చిన చిన్న పిల్లల ప్రత్యేక వైద్యులు ప్రొఫెసర్ డాక్టర్ టి.ఉషారాణి గురువారం నాడు నాగర్ కర్నూల్ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి వైద్య పర్యవేక్షకులుగా విధులలో చేరారు.ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.రఘు ఆమెకు ఆహ్వానం పలికారు.ఈ కార్యక్రమంలో రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవిశంకర్ నాయక్,డాక్టర్ సూర్యనారాయణ, కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ (అడ్మిన్) సీ.జే.వసంత్ కుమార్, పరిపాలన అధికారి రామచంద్రయ్య,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి వివేక్‌కి వినతి పత్రం అందజేత

**కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ సమస్యలు పరిష్కరిస్తా**
**కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీని ఆదేశిస్తానన్న మంత్రి**
**కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**



**హైదరాబాద్,జులై 10 :**
తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 30 వేల మంది వివిధ గ్యాస్ ఏజెన్సీలలో డెలివరీ వర్కర్స్ గా పని చేస్తున్నారని వారి సమస్యలు పరిష్కరిస్తామని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు. గురువారం నాడు తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ నేతలు కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ ను హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించారు .ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఎల్పిజి గ్యాస్ డీలర్లు డెలివరీ బాయ్స్ ని అనేక రకాలుగా వేధింపులకు గురి చేస్తున్నారని కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడంలేదని వారు మంత్రికి తమ ఆవేదన వెలిబుచ్చారు. కార్మిక శాఖలో 2015 వ సంవత్సరంలో గత బిఆర్ఎస్ అధికారులు ఇచ్చిన 904 మెమో వల్ల అధికారులు కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.సానుకూలంగా స్పందించిన మంత్రి వివేక్ కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన కార్యక్రమంలో తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ గౌరవ సలహాదారులు టి.చిరంజీవులు రిటైర్డ్ ఐఏఎస్ కార్మికుల సమస్యలను మంత్రికి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ సలహాదారులు చామకూర రాజు, కె వి గౌడ్, యూనియన్ అధ్యక్షులు ఎన్. శ్రీనివాస్ గౌడ్ ఉపాధ్యక్షులు యునూస్, నర్సింగరావు, కోశాధికారి కుమార్ తదితరులు పాల్గొన్నారు

# స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

**- బీసీ డిక్లరేషన్ ప్రభుత్వం అమలు చేయాలి**

**- ఈ నెల 15న ఇందిరాపార్క్ వద్ద బీసీల మహాధర్నా - బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం రాష్ట్ర నాయకులు**




**ఎల్కతుర్తి, జూలై 10**

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్లు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకార స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు గడిల కుమార్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, సంఘం జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య, ప్రధాన కార్యదర్శి ప్రణీత్ చందర్లు ఎల్కతుర్తిలో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి బీసీపీఎఫ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ముందు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి ప్రభుత్వము గద్దెనెక్కి కాలయాపన చేస్తుందన్నారు. పార్టీ తరుపున రిజర్వేషన్లు ఇస్తామని చెప్పడం బీసీలను మోసం చేయడమేనన్నారు. 42శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాత స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీ సామాజిక వర్గానికి మొత్తం జనాభా సర్వే నిర్వహించాలని, 33శాతం మహిళ రిజర్వేషన్లలో కూడా బీసీ మహిళలకు ఇవ్వాలని, మాట తప్పి జీవోల ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే బీసీ వర్గాల ఆగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. స్టేట్ కార్పోరేషన్ చైర్మన్లలో 42శాతం బీసీలకు ఇవ్వాలన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయని పక్షంలో పార్టీలకు అతీతంగా బీసీ ప్రజాప్రతినిధులతో పాటు సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 15న ఇందిరాపార్క్ వద్ద వార్డు మెంబర్ మొదలుకొని ఎమ్మెల్యే, ఎంపీల వరకు బీసీ ప్రజాప్రతినిధులు, సంఘాలు, అన్ని పార్టీలతో కలిపి ఆందోళన నిర్వహిస్తామన్నారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే సకల జనుల సమ్మె తరహాలో ఉద్యమం చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం బీసీల మహా ధర్నా పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు సుప్ప ప్రకాశ్, వల్లూరి వీరేశ్, నవీన్ సాగర్, రాజేశ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తంగెడ నగేశ్, సొసైటీ చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, నాయకులు మునిగడప శేషగిరి, చెవుల కొమురయ్య, స్థానిక సర్పంచ్ లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల ఆక్రమణ, ఇళ్ల స్థలాలపై టీజేఎస్ ఆందోళన

**ఈ నెల 18న తహసిల్దార్ కార్యాలయం ముట్టడి..**



**కేశవపట్నం, జులై 10**

మొలంగూరు గ్రామంలోని సర్వే నెంబర్ 703లో ప్రభుత్వ భూముల ఆక్రమణ, నిరుపేద లకు ఇళ్ల స్థలాల కేటాయింపు లో జాప్యంపై తెలంగాణ జన సమితి (టీజేఎస్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయమై ఈ నెల 18న తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని టీజేఎస్ జిల్లా అధ్యక్షులు మోరె గణేష్ హెచ్చరించారు. ఈ ముట్టడిలో అన్ని రాజకీయ పార్టీలు, యువజన, ప్రజా సంఘాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. మోరె గణేష్ మాట్లాడుతూ, ఎంఆర్ఓ, డీపీఓలపై పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినప్పటికీ రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సర్వే నెంబర్ 703లోని ఆక్రమిత ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దురాళ్లను ఏర్పాటు చేసినప్పటికీ, హద్దురాళ్ల లోపల కొందరు భూములను ఆక్రమించి అక్రమంగా రేకుల షెడ్లు, కొట్టాలను నిర్మించారని ఆయన తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాల కింద ప్రతి కుటుంబానికి రెండు గుంటల భూమిని కేటాయించి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని మోరె గణేష్ గుర్తు చేశారు. అయితే, మిగతా ఎకరాల భూమి ఆక్రమణకు గురైందని, కేటాయించిన ఇళ్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్, అనుమతులను పరిశీలించి ఆక్రమణలను తొలగించాలని పలుమార్లు ధర్నాలు, అరెస్టులు, నిరాహార దీక్షలు, నిరసనల ద్వారా జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పారు. జిల్లా కలెక్టర్ పలుమార్లు ఆదేశాలు జారీ చేసినా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడంపై నిరసనగా ఈ ముట్టడిని నిర్వహిస్తున్నామని మోరె గణేష్ స్పష్టం చేశారు. గూడు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించి, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న ఎంఆర్ఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి పార్టీ నాయకులు కోరపెల్లి శివప్రసాద్, గాజుల శ్యామ్, మోరె శ్రీకాంత్, దాసారపు శివ స్వామి, మోరె వంశీ, కోరపల్లి శివ సాయి పాల్గొన్నారు.

# కర్ణాటక బాలికకు ఉచిత గుండె ఆపరేషన్

**చొరవ చూపిన దామోదర.. తల్లిదండ్రుల భావోద్వేగం**

**ప్రాణాలు కాపాడిన దేవుడంటూ మంత్రికి కృతజ్ఞతలు**



**హైదరాబాద్, జూలై 10 :** చక్కగా ఆడిపాడే ఎనిమిదేళ్ల వయసులో తమ బిడ్డకు ప్రాణాంతకమైన గుండె జబ్బు ఉందని తేలడంతో ఆ నిరుపేద తల్లిదండ్రుల గుండెల్లో రాయిపడ్డట్లయింది. చికిత్సకు రూ.5 లక్షలు అవసరపడుతుండటం..అంత సొమ్ము వెచ్చించే స్తోమత లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదరను సాయం కోసం అర్థించారు. మంత్రి వెంటనే స్పందించి.. పాపకు నిమ్స్లో ఉచితంగా ఆపరేషన్ చేయించడంతో ఆ కన్నవారిలో ఆనందం అర్ణవమైంది. కర్ణాటకకు చెందిన చంద్రకాంత్ దంపతులు హైదరాబాద్ మలక్పేట్లో ఉంటూ ఓ హెూటల్లో పని చేసుకుంటున్నారు. బిడ్డ ఐశ్వర్య (8) తరచూ అనారోగ్యానికి గురవుతుండటంతో ఆస్పత్రిలో చూపించారు. పాప గుండె జబ్బు (ఏట్రియల్ సెప్టల్ డిఫెక్ట్)తో బాధపడుతోందని, శస్త్రచికిత్స చేయకపోతే ఆమె ప్రాణాలకే ప్రమాదం అని, ఆపరేషన్కు రూ.5లక్షలు ఖర్చవుతుందని అక్కడి డాక్టర్లు చెప్పారు. చంద్రకాంత్ దంపతుల స్వస్థలం కర్ణాటక కావడంతో వారికి ఆరోగ్యశ్రీ కార్డు గానీ, రేషన్ కార్డు గానీ లేవు. బాధిత కుటుంబం మంత్రి దామోదరను కలిసి, పాప పరిస్థితిని వివరించింది. వెంటనే స్పందించిన మంత్రి.. చిన్నారి ఐశ్వర్యను నిమ్స్లో చేర్పించారు. ఆమెకు ఆపరేషన్ ఉచితంగా చేయాలని ఆదేశించారు. ఆ మేరకు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, ఆపరేషన్కు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 4న గోపాల్, ప్రవీణ్ నేతృత్వంలోని డాక్టర్ల బృందం ఐశ్వర్యకు శస్త్రచికిత్స చేశారు. పాప పూర్తిగా కోలుకోవడంతో ఇంటికి పంపించారు. చంద్రకాంత్ దంపతులు పాపతో కలిసి గురువారం సచివాలయంలో మంత్రి దామోదరను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

# విద్యావేత్త చుక్కా రామయ్యకు సత్కారం

**పరామర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ రామకృష్ణారావు**



**హైదరాబాద్ సిటీ, జూలై 10 :** గురుపౌర్ణమి సందర్భంగా ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య(99)ను పలువురు ప్రముఖులు కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. కొంతకాలంగా వయసురీత్యా ఎదురయ్యే ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ చుక్కా రామయ్య మంచానికే పరిమితమైన సంగతి తెలిసిందే. ఈ మేరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు కె.రామచంద్రమూర్తి, ఎమెస్కో విజయకుమార్‌చుక్కా రామయ్యను గురువారం విద్యానగర్‌లోని ఆయన నివాసంలో పరామర్శిం చారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందించడంతో పాటు పూలమాల, శాలువాతో సత్కరించి, ఆశీస్సులు తీసుకున్నారు. విద్యారంగానికి రామయ్య అందించిన సేవలను ఈ సందర్భంగా వారంతా ప్రస్తావిస్తూ కొనియాడారు. తనను పరామర్శించడానికి వచ్చిన ప్రఖ్యాత సామాజికవేత్త ఆచార్య హరగోపాల్, వనమాల దంపతులను చూసి రామయ్య భావోద్వేగానికి లోనయ్యారు. సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ వాట్సాప్ వీడియోకాల్ ద్వారా చుక్కా రామయ్యకు గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. వందేమాతరం ఫౌండేషన్ రవీందర్, సీనియర్ జర్నలిస్టు శ్రీనివాసరెడ్డితో పాటు వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు రామయ్యకు పాదాలకు నమస్కరించి ఆశీస్సులు అందుకున్నారు. తాను మాట్లాడలేని స్థితిలోనూ వారందరినీ చూసి సంజ్ఞలద్వారా రామయ్య సంతోషాన్ని వ్యక్తం చేశారు.

### హీరో విజయ్ వ్యాఖ్యలపై ఎస్టీ కమిషన్ విచారణ

**సైబరాబాద్ పోలీసులపై సీరియస్**

**కమిషనర్‌ను విచారణకు పిలిస్తే ఏసీపీ వచ్చారెందుకని ప్రశ్న**

**హైదరాబాద్, జూలై 10:**

సినీ హీరో విజయ్ దేవరకొండ ఇటీవల ఒక సినిమా వేడుకలో గిరిజనులకు సంబంధించి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయంటూ వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన జాతీయ ఎస్టీ కమిషన్ గురువారం సైబరాబాద్ పోలీసులపై సీరియస్ అయింది. విచారణకు సైబరాబాద్ కమిషనర్‌ను రావాలని నోటీసు జారీ చేస్తే.. మాదాపూర్ ఏసీపీ విచారణకు రావడాన్ని కమిషన్ తప్పు పట్టింది.

## పేద విద్యార్థులకు గ్రేస్ సొసైటీ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్స్ పంపిణి



**చర్ల, జులై 10**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోనీ సింగసముద్రం లో గురువారం గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఖమ్మం వారిచే జి.యస్.యస్ చైల్డ్ కేర్ సెంటర్ కు చెందిన సుమారు 135 మంది నిరు పేద విద్యార్థిని విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ పుస్తకాలు , పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన అతిథులుగా చర్ల ఎస్ ఐ పి కేశవ్ ,పంచాయతీ కార్యదర్శి టి సురేష్ లు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేయడం చాలా సంతోషకరమని ఇటువంటి సహాయాన్ని అందిస్తున్నటువంటి గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు . మారుమూల గిరిజన గ్రామాలలో పేద పిల్లలకు సహాయం చేయడానికి ఇటువంటి స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావడం చాలా అభినందనీయమనీ, సంస్థ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు దొడ్డా ప్రభుదాస్ ,స్వచ్ఛంద సంస్థ సిబ్బంది మురళీకృష్ణారెడ్డి, సతిష్.లెనిన్ కాలనీ హెచ్ ఎం జి చిట్టిబాబు ,తుర్రం .వీర భద్రం చైల్డ్ కేర్ సెంటర్ సిబ్బంది పూజారి .లక్ష్మణ్ .రాజమ్మ పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





## సమగ్ర ప్రగతిశీల విద్యా విధానం అమలు చేయాలి

**ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేకమైన ఉచిత బస్సులు ఏర్పాటు చేయాలి**

**బీసీ ఎస్సీ ఎస్టీ జాక్ నాయకులు బొంకూరి రాజు**



**ఎల్కతుర్తి, జూలై 10**

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని ఎల్కతుర్తి మండల కేంద్రంలోని డిప్యూటీ తాసిల్దార్ భద్రు నాయక్ కు బీసీ ఎస్సీ ఎస్టీ జాక్ నాయకులు వినతి పత్రం అందించారు తెలంగాణ రాష్ట్రంలో దాదాపుగా 26 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో చదువుతున్న పాఠశాలకు దూరంగా నివాసం ఉంటున్న వారే ఉన్నారు విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు ప్రభుత్వం ఈ సమస్యను గుర్తించి ప్రతి ప్రభుత్వ పాఠశాలకు ప్రత్యేకమైన ఆ పాఠశాలకు సొంతదైన ప్రభుత్వ ఉచిత బస్సు సౌకర్యాన్ని విద్యార్థులకు కల్పించాలి ప్రతి నాలుగు గ్రామాలకు సెక్టార్ గా విభజించి ఆధునాతన సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాల నిర్మించి సెమి రెసిడెన్షియల్ ఏర్పాటు చేసి కామన్ విద్యా విధానాన్ని అమలు చేయాలి ఒక దేశ భవిష్యత్తు దాని తరగతి గదుల్లోనే నిర్మించబడుతుంది ఈ ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైనది విద్య మాత్రమే కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు సింహ భాగం బడ్జెట్ కేటాయింపులు చేసి ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధికి పాటుపడాలి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక బస్సు చొప్పున ఏర్పాటు చేసి బడిబాటకు తీసుకెళ్లాలి తప్పకుండా ఈ డిమాండ్ ను నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ ఎస్సీ ఎస్టీ జాక్ నాయకులు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బొంకూరి రాజు ఎర్ర ప్రకాష్ మారుపాక రవి అరుణ్ మొండయ్య తిరుపతి ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఎంపీలకు 40% కోటా ఇవ్వండి

**సీఎంకు ఎంపీ రఘునందన్ లేఖ**

**ఎంఐఎంకు లొంగిపోయిన హైడ్రా: ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి**

**హైదరాబాద్, జూలై 10:** ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో లబ్ధిదారుల ఎంపికలో ఎంపీలకు కూడా 40 శాతం కోటా కేటాయించాలని ఎంపీ రఘునందన్‌రావు గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. స్థానిక ఎమ్మెల్యేలకు ఇందులో ఇప్పటికే 40 శాతం కోటా కేటాయించారని, ప్రజల మద్దతుతో గెలిచిన ఎంపీలకు కూడా అవకాశం కల్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న పథకానికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులు కూడా అందుతున్నాయని గుర్తు చేశారు. హైడ్రా.. ఎంఐఎంకు లొంగిపోయిందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. సల్కం చెరువు మధ్యలో కట్టిన అక్రమ భవనాలను కూల్చివేసేందుకు భయపడుతోందని అన్నారు. మానవత్వం అన్నది ముస్లింల విషయంలోనే వర్తిస్తుంది గానీ, హిందువుల విషయంలో ఎందుకు వర్తింపజేయరని రంగనాథ్‌ను నిలదీశారు. అక్రమంగా ఉంటున్న రోహింగ్యాలను తక్షణం పంపించాలని సీఎం రేవంత్‌కు విజ్ఞప్తి చేశారు.

## బీసీరిజర్వేషన్లు పెంచకుండా స్థానిక ఎన్నికలు వద్దు!

**మంత్రి పొన్నంతో జాజుల**

**హైదరాబాద్, జూలై 10:** బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎట్టి పరిస్థితుల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించవద్దని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం బీసీ సంఘాల నేతలతో కలిసి మినిస్టర్స్ క్వార్టర్స్‌లో పొన్నంకు వినతి పత్రం సమర్పించారు. రిజర్వేషన్లపై కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి.. అఖిల పక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవాలని కోరారు. అసెంబ్లీలో బిల్లు ఆమోదించి చేతులు దులుపుపోకుండా, రాజ్యాంగ భద్రత రావాలంటే తమిళనాడు తరహాలో.. రిజర్వేషన్ల అంశాన్ని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని మంత్రికి శ్రీనివాస్ గౌడ్ వివరించారు. ఈనెల 21నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో.. బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం మెడలు వంచే విధంగా ప్రభుత్వ కార్యాచరణ ఉండాలని సూచించారు.

# ధనుష్ 54 మొదలైంది



తమిళంతో పాటు తెలుగులో కూడా మంచి మార్కెట్ ఉన్న హీరోల్లో ధనుష్ ఒకరు. ఇటీవలే ఆయన 'కుబేర' చిత్రంతో భారీ హిట్ దక్కించుకున్నారు. ప్రస్తుతం ఆయన వరుసగా సినిమాల్ని అంగీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ధనుష్ 54వ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. డీ54 వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి విఘ్నేష్ రాజా దర్శకత్వం వహిస్తున్నారు. ఇషారి కె గణేష్ నిర్మాత. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను కూడా మొదలుపెడుతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో ధనుష్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. హై ఇంటెన్సిటీ యాక్షన్ చిత్రమిదని, ధనుష్ పాత్ర కొత్త పంథాలో ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. మమితబైజు, కె.ఎస్.రవికుమార్, జయరామ్, కరుణాస్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: తేని ఈశ్వర్, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, దర్శకత్వం: విఘ్నేష్ రాజా.



# ప్రతీకారం తీర్చుకుంటా

అడవి శేష్ 'డెకాయిట్' గ్లింప్స్ సినిమాపై విపరీతమైన బజ్ క్రియేటయ్యేలా చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 25న 'డెకాయిట్'ని విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు కూడా.

ఇదిలావుండగా.. కథానాయిక మృణాళ్ ఠాకూర్ ఈ సినిమాకు సంబంధించి చేసిన ఓ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నది. తన నుదుటికు తగిలిన గాయాన్ని చూపిస్తూ 'సబ్‌కా బద్లా లేగీ జూలియట్' అంటూ పోస్ట్ చేశారు మృణాళ్. ఈ ఫొటోలో తన పక్క అడవి శేష్ కూడా ఉండటం గమనార్హం. 'అందరిపై ప్రతీకారం తీర్చుకుంటా' అనేది ఈ పోస్ట్‌కు తెలుగర్థం. ఇటీవల విడుదల చేసిన గ్లింప్స్‌లో మృణాళ్ ఠాకూర్‌ని అడవి శేష్ 'జూలియట్..' అని సంబోధించిన విషయం తెలిసిందే. పైగా ఇది ఓ బ్రేకప్ ప్రేమజంట మధ్య నడిచే ప్రతీకార కథ అని ఈ సినిమా టీజర్ ఇప్పటికే చెప్పేసింది. ఈ నేపథ్యంలో మృణాళ్ చేసిన ఈ పోస్ట్ సినిమాపై ఇంకొంచెం హైప్‌ని పెంచిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. షనీల్‌డియో దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్నారు. అనురాగ్ కశ్యప్, ప్రకాశ్‌రాజ్, సునీల్, అతుల్ కులకర్ణి, కామాక్షి భాస్కర్ల ఇతర తారాగణం.

# నలందా నేపథ్యంలో 'గేమ్ ఆఫ్ ఛేంజ్'



5వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నలందా విశ్వవిద్యాలయం నేపథ్యంలో జరిగిన కొన్ని సంఘటనల నేపథ్యంలో రూపొందిస్తున్న చిత్రం 'గేమ్ ఆఫ్ ఛేంజ్'. ఇంగ్లీష్, తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా రానుంది. జాతీయ, అంతర్జాతీయ నటులతో ఈ చిత్రాన్ని రూపొందించారు. సిధిన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సిద్ధార్థ్ రాజశేఖర్, మీనా చాబ్రియా నిర్మాతలు.త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ సందర్భంగా ఇటీవల విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. గుప్తుడి కాలం నాటి యథార్థ సంఘటనల తో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని నిర్మాత, హీరో సిద్ధార్థ్ రాజశేఖర్ తెలిపారు. స్ఫూర్తివంతమైన కథాంశమిదని నిర్మాత మీనా చాబ్రియా పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీరాజ్ సాజి, దర్శకత్వం: సిధిన్.

# సిల్లీ న్యూస్‌కి మా రియాక్షన్ ఇదే..



సినీ ఇండస్ట్రీలో రూమర్లు సర్వసాధారణం. మరీ ముఖ్యంగా సోషల్‌మీడియా వచ్చాక.. రైటర్లు ఎక్కువై పోయారు. చిన్న లూప్ దొరికితే చాలు.. దానిపై ఇష్టానుసారం అల్లేయడం ప్రస్తుతం పరిపాటైపోయింది. ఇందులో భాగంగానే రీసెంట్‌గా నయనతార దంపతులు విడిపోనున్నారంటూ కోలీవుడ్‌లో ప్రచారం మొదలైంది. ఈ జంట త్వరలోనే విడాకులు తీసుకోబోతున్నారన్న కోణంలో పలు వెబ్‌సైట్లలో కథనాలు కూడా వచ్చాయి. వీటిపై తాజాగా నయనతార స్పందించారు. తన భర్త విఘ్నేష్‌శివన్‌తో కలిసి దిగిన ఓ ఫొటోను షేర్ చేస్తూ.. 'మాపై వచ్చే సిల్లీ న్యూస్‌కి మా రియాక్షన్ ఇదే..' అంటూ అసత్య ప్రచారాలకు చెక్ పెట్టేశారు నయన్. నిజానికి ఈ వదంతులకు కారణం లేకపోలేదు. కొన్ని రోజుల క్రితం స్వయంగా నయనతార ఓ పోస్ట్ పెట్టారు. 'తెలివి తక్కువ వ్యక్తిని పెళ్లి చేసుకోవడం పొరపాటు. నీ భర్త తప్పులకు నువ్వు బాధ్యత వహించాల్సిన అవసరం లేదు..' అంటూ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు నయన్. అయితే.. ఏమైందో ఏమో.. కొన్ని గంటల వ్యవధిలోనే ఆ పోస్ట్‌ని డిలీట్ చేసేశారామె. అయితే.. అప్పటికే ఆ పోస్ట్‌కు సంబంధించిన స్క్రీన్ షాట్స్ విపరీతంగా వైరల్ అయిపోయాయి. దాంతో విడాకులు అంటూ ప్రచారం మొదలైంది. అదన్నమాట అసలు విషయం.

# పూజా హెగ్డే బ్యాడ్ టైం..

## స్టార్ హీరో మూవీ నుండి ఔట్..!

ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అందాల ముద్దుగుమ్మ పూజా హెగ్డే. దక్షిణాదిలోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా ఈ అమ్మడు అదరగొట్టింది. ఇండస్ట్రీలో అత్యధిక రెమ్యునరేషన్ అందుకొనే హీరోయిన్లలో ఒకరిగా నిలిచిన ఈ ముద్దుగుమ్మ తన అందం, అభినయంతో ఎంతగానో మెప్పించింది. అరవింద సమేత వీర రాఘవ, మహర్షి, గద్దలకొండ గణేష్, హౌస్‌ఫుల్ 4, అల వైకుంఠపురంలో, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ సినిమాలతో వరుస సక్సెస్ సాధించిన పూజా హెగ్డే ఆ తర్వాత మాత్రం హిట్ కోసం ఎంతో ఎదురు చూసింది. రాధే శ్యామ్ , బీస్ట్, ఆచార్య, సర్కస్, కిసి కా భాయ్, కిసి కీ జాన్, దేవా, రెట్రో సినిమాలు వరుసుగా ఫ్లాప్ అయ్యాయి. ఇటీవల వచ్చిన రెట్రో చిత్రంలో డీ గ్లామరైజ్డ్ పాత్ర పోషించగా, దీనిపై కూడా ఎన్నో ఆశలు పెట్టుకుంది. కాని అది కూడా అభిమానులకు నిరాశను మిగిల్చింది. తాజాగా ఆమెకు దక్కాల్సిన ఓ క్రేజీ కోలీవుడ్ ఆఫర్ మిస్ అయినట్టు తెలుస్తుంది. కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా, విగ్నేష్ రాజా దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలో పూజా హెగ్డేను హీరోయిన్‌గా తీసుకునే యోచనలో ఉండగా, చివరికి ఆమె స్థానంలో మలయాళ బ్యూటీ మమితా బైజును ఫైనల్ చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. మమితా బైజు, 'ప్రేమలు' సినిమా ద్వారా ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది. తాజాగా దళపతి విజయ్, సూర్య వంటి టాప్ హీరోల ప్రాజెక్టుల్లో అవకాశాలు దక్కించుకుంటూ, దక్షిణాది చిత్ర పరిశ్రమలో దూసుకుపోతుంది. ఇప్పుడు ధనుష్ సినిమా అవకాశం దక్కడంతో ఆమె కెరీర్ దూసుకుపోయే ఛాన్స్‌లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో పూజా హెగ్డే నటించిన చిత్రాలు వరుసగా ఫ్లాప్ అవ్వడంతో ఆమె మార్కెట్‌లో కొంత వెనుకబడినట్లు తెలుస్తోంది. అయితే ఇది తాత్కాలికమేనని, ఆమె బౌన్స్ బ్యాక్ అయ్యే అవకాశాలు ఉన్నాయని అభిమానులు నమ్ముతున్నారు.అ యితే ఈ ఒక్క సినిమా మిస్ అయినా, పూజా చేతిలో ప్రస్తుతం రజనీకాంత్, విజయ్, రాఘవ లారెన్స్ లాంటి స్టార్ హీరోలతో భారీ ప్రాజెక్టులు చేస్తుంది. ప్రస్తుతం షూటింగ్‌లతో బిజీగా ఉన్న పూజా, త్వరలోనే మళ్లీ ఫాంలోకి వస్తారని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146